# దైవానుగ్రహం కోసం పరితపించండి

శిలల పూజలందు శ్రేష్ఠుండు నీవౌచు
ప్రజల మెప్పు కొరకు పాటు పడియు
ఇట్టి పూజలెల్ల ప్రజలు మెచ్చిరిగాని
శివుడు మెచ్చుసేవ చేయరయ్య

చదువు చదివి చదివి సద్గుణములు లేక
ప్రజల బాధపెట్టి బ్రతుకువాడు
ఇట్టి చదువుకన్న నయమగు గాడిద
బరువుమోసి తాను బ్రతుకుచుండు

ప్రేమ రూపంబు దైవంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప నీమ మగును
కాని ప్రేమను పూర్తిగా కలిగియున్న
అద్వితీయంబు చేరంగ అర్హుడగును

ప్రేమ స్వరూపులారా!

భగవంతుడు పరిపూర్ణ ప్రేమమయుడు. అట్టి ప్రేమనే సర్వులయందు సమత్వంగా వెదజల్లుతూ ఉంటాడు. పరిమళమైన పుష్పములు కుడిచేతి యందుంచు కున్నను, ఎడమచేతి యందుంచుకున్నను సుగంధము ఒక్కటే. అదేవిధముగనే భగవంతునకు హితులు అహితులు అనుభేదము లేదు. వారి వారి భావములను పురస్కరించుకొని కేవలము యద్భావం తద్భవతి అన్నట్లుగా భగవంతుని యందు కూడను భేదములను సృష్టించి భగవంతుడు భేదమయుడు అనే మార్గములో జీవిస్తూ ఉంటారు. సజ్జనులు, దుర్జనులు అనిగాని, హితులు అహితులు అనిగాని, దుష్టులు సన్మార్గులు అనిగాని ఎట్టి భేదము భగవంతునకు లేదు. ఇనుపగొడ్డలి



srisathyasaivachanamrutam

గంధము చెట్టును నిర్దాక్షిణ్యముగా నిర్మోహంగా నరికినప్పటికిని ఆ గంధము చెట్టు ఆ కఠినమైన గొడ్డలికి కూడను తన సుగంధమును అందిస్తూ ఉంటుంది. అదేవిధముగనే ఎట్టి వారినైనను సమ ప్రేమ వారిని ప్రేమించి, వారిని ఆదరించి అనుగ్రహించి ఆనందమును అందించుటకు భగవంతుడు సంసిద్ధుడై ఉంటాడు. కానీ సంకుచితమైన భావములు గల వ్యక్తులయందు భగవంతునియొక్క సమత్వమును గుర్తించుకోవటం చాలా కష్టము. నిజమే. చేపల వ్యాపారము తెలిసినవానికి వజ్రముల విలువ ఏరీతిగా గుర్తించగలడు. వారి వారి స్థితిగతులను పురస్కరించుకొని దైవముయొక్క శక్తి సామర్థ్యములను తన మనో భావమునకు సరియైనట్టుగా వారు అనుభవిస్తూ ఉంటారు.

ఇట్టి సంకుచితమైన భావములు దూరము గావించుకొనవలెనన్న ప్రేమను పెంచుకోవాలి. ఈ ప్రేమ పెరిగే విధానము ఏమిటి? ఇచ్చుకోవటము, క్షమించటము వీటి ద్వారా మానవుడు ప్రేమ జీవితుడౌతాడు. కనుక నిరంతరము భగవంతునకు హృదయాన్ని ఇచ్చే స్థితిలో ఉంచుకోవాలి. కానీ ఈనాడు ఆ విధమైన పవిత్ర భావములు కోల్పోయి పుచ్చుకోవటము, మరచిపోవటము వీటిని మాత్రమే పెంచుకుంటున్నారు. భగవంతుని ప్రేమను, భగవంతుని అనుగ్రహమును, భగవంతుని ఆనందమును తాము పుచ్చుకొని తిరిగి ఆ పుచ్చుకున్న దానికి తగిన కృతజ్ఞత లేకుండా సంచరించటము చేత స్వార్థుడై అనేక విధములుగా సంకుచిత భావములను పొందుచున్నాడు.

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః అన్నాడు సంజయుడు. మానవుడు తన జీవితములో ఆనందమును, సుఖమును, విజయాన్ని సాధించాలని అనేక విధములైన ప్రయత్నములు చేస్తున్నాడు. కాని ఇట్టి విజయమును, ఇట్టి ఆనందమును, ఇట్టి అనుగ్రహమును పొందాలనుకుంటే ఏ విధమైన మార్గములో మనము జీవించాలి. ఎక్కడ భగవంతుడున్నాడో ఆ భగవంతుని ప్రక్కలోనే తానుండాలి. పార్థుడనగా పృథ్వీ పుత్రుడైన మానవుడే. మానవుడు దైవమునకు ప్రక్కనైనాగాని లేక దైవము మానవునకు ప్రక్కనైనాగాని ఉండినప్పుడు ఈ విజయము మనకు సంభవిస్తుంది. కాని ఈనాడు ఇవి రెండూ యేమాత్రం జరగటం లేదు. తానెక్కడో దైవమెక్కడో అనే భావము చేతనే తన జీవితాన్ని వ్యర్థం గావించుకుంటున్నాడు మానవుడు.

srisathyasaivachanamrutam

మానవునియొక్క ధ్యేయమేమిటని వాడు గుర్తించటం లేదు. కనుక మన ధ్యేయాన్ని మనం మరువకుండా గుర్తించుకోవాలి.

**జీసస్ వృత్తాంతము**

మానవునియొక్క ధ్యేయం ఏమిటని అన్ని దేశముల వారు, మతముల వారు దీన్ని గురించి పరిశోధనలు సలుపుతూ వచ్చారు. అట్లు జరుపుతూ రావటం చేత మతములు అనేక విధములుగా వ్యాపిస్తూ వచ్చాయి. ఈ క్రిష్టియన్ మతమునకు జీసస్ ప్రధానుడు. ఈ జీసస్‌కు పూర్వము రెండువేల సంవత్సరముల పూర్వము యూదులని ఒక తెగవారు ఉండేవారు. వీరియొక్క మతమునకు ఒక విధమైన దృఢ విశ్వాసము కలిగి పవిత్రమైన భావంచేత జుడాయిజం అనే పేరుతో అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. ఈ మతమునకు స్థాపకుడు మోజస్. ఈ మతమునకు స్థాపకుడు మోజస్ అయినప్పటికిని గురువు రాబిట్. ఈ మోజస్, రాబిట్ కూడా భగవంతుని అనుజ్ఞ వల్లనే ప్రపంచమునకు బోధిస్తూ ఉన్నారు అనే విశ్వాసం ఈ యూదులందు గాఢంగా ఉండేది. ఇంతేకాక వారు భగవంతుడే ప్రత్యక్షముగా వచ్చి ఈ ఇజ్రయిల్ జనములందరిని కాపాడుతాడనే విశ్వాసం కూడా ఉండేది. మెస్సయ్యా వస్తాడని అతడే ఈ ఇజ్రయిల్ జనములందరిని కాపాడతాడని విశ్వాసంతో ఎదురు చూస్తూ వచ్చారు.

ఇలాంటి పరిస్థితియందే నజరత్ అనే గ్రామమునందు మేరీ జోసెఫ్ అనే దంపతులు ఉండేవారు. వీరిరువురికి జన్మించిన పుత్ర రత్నమే జీసస్. మొగ్గ పుట్టగనే అందరిని ఆహ్వానించటం లేదు మొగ్గ. కాని ఆ మొగ్గయందు వెలువడిన పరిమళమే అందరిని దాని దృష్టికి లాక్కుంటుంది. అదే విధముగనే ఈ జీసస్ పుట్టిన తరువాత క్రమక్రమేణా అనేకమంది అనేక రీతుల ఆ బిడ్డను విచారించుకుంటూ వచ్చారు. మొదట దర్శించినవారు ముగ్గురు అరేబియన్ రాజులు. ఒకరాజు ఆ బిడ్డను చక్కగా చూసి చెప్పాడు 'ఈ బిడ్డ భగవంతుని అమితంగా ప్రేమించేవానిగా తయారౌతాడ'ని. ఇంకొక చక్రవర్తి చెప్పాడు కాదు కాదు. భగవంతుడే ఈ బిడ్డను అమితంగా ప్రేమిస్తాడని. ఇంకొక రాజు చెప్పాడు భగవంతుడే తాను. తానే భగవంతుడు అని. అనగా దీనియొక్క అంతరార్థము ఏమిటి? భగవంతుని ప్రేమించేవారంతా మెసెంజర్సు అని. భగవంతుడే మిమ్మల్ని ప్రేమించినప్పుడు వారు Son



sri sathyasai vachanamrutam

of God అని. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. అని తన తత్త్వమంతయు భగవంతునియందు ఇమిడ్చి ద్వైతభావము లేక ప్రేమించే సమయంలో తండ్రి కుమారులిద్దరు ఒక్కరే. I and My father are one అన్నాడు. ఈ జీసస్ పుట్టినప్పటి నుండి సామాన్యమైన బిడ్డవలే కాక ఒక అధికమైన దైవభావముల కల తేజస్సుతో ప్రకాశిస్తూ ఉండేవాడు. విలక్షణమైన గుణములు కలిగినటువంటి వాడు. దీనికి తగినట్లుగా తల్లి తండ్రి కూడా భగవంతునికి పరమభక్తులు. మేరీకూడను చిన్న బిడ్డకు నిరంతరం భగవంతునియొక్క కథలు, భగవంతుని గుణగణ విశేషములను అమితంగా బోధిస్తూ ఉండేది. అగ్నికి గాలి తోడైనట్లుగా ఆ జీసస్‌యొక్క భావములకు, తల్లిదండ్రులయొక్క ప్రబోధలు మరింత వుప్పొంగింపచేశాయి. ఈ విధముగా పెరుగుతూ వచ్చాడు జీసస్.

యూదులకు ప్రధానమైన స్థానం జెరూసలెం. అక్కడ యూదులందరూ చేరి అనేక విధములుగా ప్రార్థనలు సలుపుతూ ఉండేవారు. ఈ జీసస్‌కు 12 సం॥ల అప్పుడు తల్లిదండ్రులు జరూసలెం వెళ్ళాలని కుమారుని కూడా తీసుకొని వెళ్ళారు. ఈ జెరూసలెంలో అనేక వింతలు విచిత్రములు చూస్తూ ఆ వైభవాల లోపల కుమారుని మరచిపోయారు. అనేక వేలమంది చేరిన గుంపులలో ఈ జీసస్ తప్పించుకున్నాడు. తదుపరి మేరీ, జోసఫ్ చూసి తమ కుమారుడు లేడని అనేక విధములుగా దుఃఖించి అనేక ప్రాంతములు వెతికారు. కాని ఎక్కడా కనిపించలేదు. కడపటికి విసుగు చెంది దేవమందిరములో పోయి చూసేటప్పటికి అక్కడ ఒక master బోధన చేయుచుండగా ఒక మూలన కూర్చుని జీసస్ చక్కగా శ్రద్ధా భక్తులతో వింటున్నాడు.

ఆ బాలుని చూసిన తక్షణమే తల్లి ఒకవైపున దుఃఖము ఒకవైపున ఆనందము రెండూ కూడా చేరి కుమారుని కౌగలించుకున్నది. నీకోసం అనేక విధములుగా వెదికి చాలా బాధపడ్డాము నాయనా అని చెప్పింది. అప్పుడు చెప్పాడు జీసస్. అమ్మా! నేను నా తండ్రి దగ్గర క్షేమంగా ఉన్నప్పుడు మీరు బాధపడవలసిన అవసరమేమిటి? ఇది దైవముయొక్క మందిరము. నా తండ్రి యొక్క ఇల్లు. ఆ ఇంటిలో ఎట్టి క్షేమమునకు కొరత ఉండదు. అట్టి అమృతమయుడైన అఖండమయమైన ఈ మందిరములో నేను క్షేమంగా ఉన్నాను. అనగా పండ్రెండవ సంవత్సరము నుండి ఈ జీసస్ చాలా దైవముయొక్క తత్త్వమును, శక్తి సామర్థ్యములను ప్రజలకు చాటటమే

srisathyasaivachanamrutam

కాకుండా తానుకూడా ఆచరించి ఆనందించి అనుభవిస్తూ వచ్చాడు. తదుపరి ఇంటికి వెళ్ళి తండ్రి వడ్రంగి పనిలో ఉండేవాడు, తండ్రికి నిరంతరము ఆ పనియందు  సహాయము చేసి ఎన్ని విధములుగానో తోడుగా వుండేవాడు. ఈ విధంగా ఉండగా కొంత కాలమునకు జోసెఫ్ మరణించాడు.

దీనితో మేరీ చాలా బాధపడుతూ ఉంది. అమ్మా! మానవ జీవితం యొక్క లక్ష్యం ఏమిటి? మనం ఎక్కడ నుండి వచ్చాము? మనం చేయవలసింది ఏమిటి? వీటిని మరచి భౌతికమైన, లౌకికమైన ఈ జగత్తునందే స్థిరంగా ఉండగలమని భ్రమించి, భావించి కాలమును వ్యర్థం చేసుకొంటున్నాము. నరుడు అనగా ఆత్మయని అర్థము. ఆకాశాది పంచభూతములు కూడను ఈ ఆత్మనుండియే ఆవిర్భవించినవి. వీటికి నారములని పేరు. నారములకధిపతియైనవాడు కనుకనే భగవంతునికి నారాయణుడని పేరు. దీనిని పురస్కరించుకొనియే ప్రతి మానవుడు ఆత్మస్వరూపుడే. ఆత్మ నుండి ఆవిర్భవించిన ఈ మానవుడు అంతముతో కూడిన అవిద్యలో, అనాత్మలో ప్రవేశించుచున్నాడు. ఈ లోక సంబంధమైన సమస్త క్రియలు కూడను ఆనందమునుగాని, వైభవమునుగాని, సుఖమునుగాని, శాంతినిగాని ఈయవు. అన్నీ అనిత్యా స్వరూపములు. కనుకనే నేనింక ప్రజలలో ప్రవేశించి ఈ అనాత్మయొక్క భావములను వారికి బోధించి ఆత్మవైపు వారి మనస్సును మరల్చటానికి వచ్చాను అని తల్లితో చెప్పి నమస్కరించి ఇల్లు వదిలాడు.

అక్కడ నుండి జమ్‌టాక్ అనే నదీ తీరమునకు వెళ్ళాడు. అక్కడకు వెళ్ళి స్నానము చేసి యూసఫ్ అనే గురువు దగ్గర ఒక మంత్రమును నేర్చుకొని దీక్షను పూనాడు నలభైదినములు. విచారణ చేశాడు. జీవితమంటే ఏమిటి? జీవితముయొక్క గమ్యము ఏమిటి? దీని ఆశయము ఏమిటి? ఈ మానవత్వంలో మనం చేయవలసిన పనియేమిటి అనే విచారణలో నలభై దినములు చాలా కఠినమైన దీక్షపూనాడు. ఎంతకాలము మనము జీవించినప్పటికి, తిండి నిద్రాదులతోనే మనం ఈ జీవితాన్ని అంత్యము చేస్తున్నాము. నూతనమైన మార్గము మనము ఏమాత్రము చేపట్టలేకపోతున్నాము. తాను, తన కుటుంబము పోషించుకునే నిమిత్తమై కాలమంతా వ్యర్థము చేస్తున్నాము. అందరినీ పోషించేవాడు భగవంతుడే. కనుక ఎవరినెవరు పోషించుకోవటం?

srisathyasaivachanamrutam

ఈ విధంగా విచారణ చేస్తూ వచ్చాడు. మూడు విషయాలు జగత్తుకు చక్కగా నాటాడు. భగవంతుడు ఒక్కడే. అతను మహాశక్తులతో కూడినటువంటి వాడు. మహత్తరమైన మహత్తులు కలిగినటువంటివాడు. ఆ మహత్తులు ప్రజలకు చూపి ప్రజలను తనవైపుకు మరల్చుకొనేందుకు ప్రయత్నం చేసేవాడు. ఈనాటి మానవులు శక్తులను చూసే దైవంవైపుకు దృష్టి మరల్చుతారు. ఎవరిని బాధించకూడదు. సర్వజీవులందు ఉండినవాడు సర్వేశుడొక్కడే. ఎవరిని బాధించినా, నొప్పించినప్పటికిని దైవమునకే ఈ బాధ సోకుతుందని పూర్తి నిర్ణయం గావించుకొని ఆ కఠినమైన అరణ్యం నుండి వెనుకకు బయలుదేరాడు. అప్పటినుండి ఈ ప్రబోధలు ప్రజలలో చాలా పవిత్రమైన భావంతో, ఉల్లాసమైన హృదయంతో ప్రజలను రంజింప చేసే మాటలతో వారికి బోధిస్తూ వచ్చాడు. ఈ విధంగా ప్రచారం సల్పుతూ రాత్రిం బవళ్లు విచారం లేకుండా, ఆహారం లేకుండా భగవంతునియొక్క శక్తులనేవిధంగా ఈ ప్రజలలో ప్రవేశింపచేయాలి, ఏ విధంగా ఈ ప్రజల మనస్సులో భగవంతుని భావన నిల్పాలి అనేభావంతో తన కార్యక్రమంలో పాల్గొన్నాడు. తిరిగి గ్రామములో ప్రవేశించి జరూసలెంలో పోయి చేరాడు.

అక్కడ వ్యాపారమంతా కూడా లౌకికమైన వ్యాపారంగా కనిపించింది. ఇలాంటి పవిత్రమైన మందిరంలో ఇలాంటి హింసాత్మక పనులు జరుపవచ్చునా? ఈ లౌకికకమైన వ్యాపారములకు సంబంధించినది కాదు ఆధ్యాత్మికము. అందరూ ఈ ఆధ్యాత్మిక వ్యాపారంలో ప్రవేశించండి అని బోధిస్తూ వచ్చాడు. ఈ ఆధ్యాత్మిక ప్రచారంగాని, ఆధ్యాత్మిక ప్రేమతత్త్వముగాని కేవలం one way traffic కాదు. ఒక్క మార్గంలో ప్రయాణించేది కాదు. ఇది give and take. ఇచ్చి పుచ్చుకునేది అన్నాడు. నీ ప్రేమను భగవంతునికి ఇవ్వాలి. భగవంతుని ప్రేమను నీవు పొందాలి. ప్రేమకు ప్రేమనే సాటిగాని మరొకటి దీనికి సాటిరాదు. అన్నాడు. Love is God. ఈ ప్రేమయే ప్రధానమైనదని బోధిస్తూ వచ్చాడు. అన్ని కాలములందు మంచి అంటే గిట్టనివారు అనేకమంది ఉంటుంటారు. అప్పుడు కూడా ఈ జీసస్ ప్రబోధలు నచ్చని వారుండేవారు. వీరందరూ ఈ జీసస్‌యొక్క ప్రబోధలకు వేలాదిమంది గుంపులుగా చేరుతూ ఆనందాన్ని అనుభవిస్తూ వుంటే అసూయాపరులు దీనిలో అభివృద్ధి అవుతూ వచ్చారు. వీరందరు అనేక విరుద్ధమైన కథలనభివృద్ధి పరచి, కడపటికి జీసస్‌ను రాజ ద్రోహిగా విశ్వసించి అతనిని పట్టి గొగటాక్ అనే స్థానంలో అతనిని ఉరి తీసారు. అది అతని ముప్పైవ సంవత్సరంతో

sri sathyasai vachanamrutam

జరిగింది.

అప్పటి నుండి జీసస్‌యొక్క ప్రబోధలు దినదినాభివృద్ధి నొందుతూ వచ్చాయి. ఈ విధంగా జరుగుతుంటే రోమన్ పాంపే చక్రవర్తి ఈ జరూసలెంను వశం చేసుకున్నాడు. అప్పటి నుండి ఈ క్రైస్తవ మతాన్ని చాలా అభివృద్ధి గావించుకుంటూ రావాలని చాలా ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ఎన్ని విధములైన యిబ్బందులు కలిగినప్పటికిని లేక్కచేయక, లక్ష్యము చేయక తనయొక్క లక్ష్యమును వదలక సాధిస్తూ వచ్చాడు. యూదులు క్రిష్టియన్‌లను అనేక రకాలుగా బాధిస్తూ వచ్చారు. ఇందులో ప్రధానమైన వ్యక్తి పీటర్. క్రమక్రమేణా ఈ మహత్తునంతా దేశానికి చాటుతూ సరియైన విషయంలో దైవత్వాన్ని లోకానికి వ్యక్తము గావించాలని ఈ అనుచరులంతా పూనుకున్నారు. క్రమక్రమేణా 380లో కాన్‌స్టంటైన్ అనే చక్రవర్తి ఈ క్రిష్టియన్ మతమును ప్రభుత్వ మతంగా నిర్ణయం చేశాడు. అప్పటి నుంచి ఈ క్రీస్తు మతము చాలా అభివృద్ధి అవుతూ వచ్చింది. ఐతే ఈ క్రీస్తు అనే పదము ఎక్కడి నుండి వచ్చింది? గ్రీకుభాషలో క్రీస్తు అనగా అభివ్యక్తుడైనటువంటి వాడు. ఈ రకమైన భావము చేతనే అప్పటి నుండి క్రీస్తు నామం జీసస్‌కు సార్థకమవుతూ వచ్చింది. అభివ్యక్తుడనే తత్త్వాన్ని లోకానికి చాటుతూ ఉండే నిమిత్తమై ఈ జీసస్‌కు క్రీస్తు అని పేరు పెట్టారు. ఈ విధమైన ప్రచారము, ప్రబోధము దినదిన వ్యాప్తి గావించటం చూసి జర్మనీలో లూథర్ అనే సన్యాసి ఈ జీసస్‌పైన అసూయ అధికం గావించుకున్నాడు. విరుద్ధమైన భావములు అభివృద్ధిపరచి ప్రచారం చేస్తూ వచ్చాడు. ఒక్కొక్కరి మతి వేరువేరుగా ఉండటం చేత ఒక్కొక్క భావములు అభివృద్ధి అవుతూ ఉంటాయి.

**సత్యమే దైవము**

**విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ**
**శంభుండు గొప్పని శైవులనగ**
**గణపతి గొప్పని గాణపతులు పలుక**
**శారద గొప్పని చదువరులన**
**అల్లా ఘనుడటంచు అల్లతురకలన**
**మాకు ఏసు అనుచు క్రైస్తవులన**

sri sathyasaivachanamrutam

**నేను గొప్పయటంచు నాదు భక్తులు చెప్ప**
**అందరొక్కటే యని కొందరనగ**
**సర్వజన సమ్మతంబైన సత్యమె**
**ఆ దైవంబు కాంచరయ్య మీరు.**

సత్యమే దైవము. Truth is God.ఈ సత్యాన్ని ఒక్కటిగా భావించుకొని సర్వమతముల వారు, సర్వ దేశములవారు, సర్వ ప్రాంతముల వారు, ఒక్క దైవత్వమును ఆశ్రయించుకొని ఇది ప్రధానమైన సత్యమని గుర్తించుకోవాలి.

ఈనాడు భగవంతుని మతంలో వెదుకుతున్నారు. కాని మతంలో లభించడు. మతిలో లభిస్తాడు. భగవంతుడు మనసునందే ఇమిడి ఉన్నాడు. కాని మతమునందు లేడు. మనసును శోధించి సాధించినప్పుడే ఈ దివ్యత్వము మనకు అర్థమవుతుంది. కనుక ఈనాటి మానవులు మనసును శోధించటం మాని కేవలం బాహ్య ప్రపంచమునందు వెదుకుతున్నారు. అన్నీ మనం భగవంతునికి అర్పితం చేస్తున్నట్లుగా భావిస్తున్నాము. కాని భగవంతుడు ఎక్కడ ఉన్నాడని. బ్రహ్మార్పణం బ్రహ్మహవిః. బ్రహ్మార్పణం గావించుకుంటున్నామన్నారు. బ్రహ్మ ఎక్కడున్నాడో తెలుసుకోకుండా అర్పితం చేస్తున్నారు. తనకు అంతర్వాణి నుండి వస్తోంది. అహం వైశ్వానరో నేను నీ యొక్క హృదయమునందే ఉంటున్నాను. నీ ఉదరమునందే ఉంటున్నాను. నీవు అర్పితం గావించినవన్నీ నేనే జీర్ణము గావిస్తున్నాను. నేను ఈ విధంగా జీర్ణం గావించిన సమస్త సారాన్ని కూడా నీ దేహానికే అందిస్తున్నాను. తన వెంటనే, జంటనే, ఇంటనే ఉన్నటువంటి దైవాన్ని విస్మరించి కేవలం భగవంతుని నిమిత్తమై బయటి ప్రపంచములో వెదుకుతున్నారు మానవులు. ఏనాటికిని బాహ్యదృష్టి చేత అంతర్భావములు పరిశుద్ధము కావు.

కనుక భగవత్ తత్త్వాన్ని మనం గుర్తించవలెనంటే మానసిక సంబంధమైన పరివర్తన మనకు అత్యవసరము. మనయొక్క నడతలు సరియైనవిగా అభివృద్ధి చేసుకోవాలి. మనయొక్క నడతలందే సర్వమూ కూడి ఉంటున్నది. మనము సరియైన భావంతో, పవిత్రమైన హృదయముతో దివ్యమైన మార్గంలో మనం ప్రవేశించాలి. వీటిని గావించుకునే నిమిత్తమై ఈ సాధనలన్నీ అభివృద్ధి అవుతూ వచ్చాయి. మనం చేసే ప్రార్థనలుగాని, జపములుగాని, ధ్యానంగాని

sri sathyasai vachanamrutam

ఇవన్నీ మనయొక్క హృదయాన్ని శుద్ధ పరచేవి. ఈ ప్రపంచములో గొప్ప పేరుపొందిన మహనీయులుగాని, మేధావులుగాని, వైజ్ఞానికులుగాని అందరు కూడా ఈ గొప్పతనం దేనివల్ల లభించిన వంటే కేవలం ఒక్క ప్రవర్తన వలనే. నడతలు సరిగా లేకుండిన ఎంత ధనవంతుడైనా, ఎంత బలవంతుడైనా, ఎంత విద్యావంతుడైనా కేవలం అనర్హుడే. ధనము కాదు మనకు ఘనతనందించేది. మన దేహబలము కాదు మనకు ఘనత నందించేది. మన మేధాశక్తి కాదు మనకు ఘనత నందించేది. మన నిత్య జీవితములో నడిచే నడతనే మనకు ఘనత నందిస్తోంది

**పరివర్తన అత్యవసరము**

ప్రేమస్వరూపులారా! మన నడతద్వారానే భగవంతుని పొందుటకు కృషి చేయాలి. ఈ నడత లేకుండా ఎన్ని సాధనలు చేసినా అన్నీ కూడా వ్యర్థమే. కనుక భగవంతుని భక్తి కలిగిన వ్యక్తులందరూ ఈ దివ్యమైన భావమును హృదయమునందు అభివృద్ధి పరచుకొని తద్వారా భగవంతుని సమీపించుటకు తగిన కృషి చేయాలి.

You are all in the kingdom of sai
You are all in Sai's Home
You are all in Sai's Light
You are all in Sai's Heart
I will bless you in the holy night
This is your right.

అంతా భగవంతుని ఇంటిలోనే ఉన్నాము. జగత్తంతయూ భగవంతుని గృహమే. ఈ సత్యాన్ని మనం గుర్తించినప్పుడు మనకింక భేదము లెక్కడ నుండి వస్తాయి. భగవంతునికి కోపమని, భగవంతునికి కష్టమని, భగవంతునికి అనేక విధముల విసుగు అని భావిస్తూ ఉంటారు. వీరు నిజంగా భగవంతునియొక్క తత్త్వాన్ని ఏమాత్రం గుర్తించుకోలేదు. పొట్టలో పుండు లేచినప్పుడు ఆ పుండును సరియైన రీతిలో నయం గావించుకున్నప్పుడు డాక్టరు ఒక కత్తి తీసుకుని పొట్టను కోస్తాడు. కానీ ఈ కోసినటువంటి కోత ఈ పేషెంటుపైన కోపంతా చేశాడా? కాదు. కాదు. అది తన మంచికోసమనే కోశాడు. ఆ వ్యక్తి పైన ప్రేమ ఉండటం చేతనే అతనికి నయంచేసి సరియైనటువంటి వ్యక్తిగా తయారు చేయాలని చేసిన పనియిది. అదేవిధముగనే కొందరిలో

srisathyasaivachanamrutam

దుర్గుణములనే రోగములు ప్రవేశించినప్పుడు ఆ రోగములు నయంగావించే నిమిత్తమై కొన్ని చికిత్సలు చేయవలసి వస్తుంది. ఈ చికిత్సలు కేవలం ఒక ద్వేషమనిగాని, కోపమనిగాని, అయిష్టమనిగాని భావిస్తు ఉంటారు. ఇది కేవలం అల్పబుద్ధులయొక్క లక్షణము. ప్రేమతత్వాన్ని గుర్తించుకున్న వ్యక్తి ఇట్టి బుద్ధులకు ఏమాత్రం అవకాశం ఇవ్వడు.

ఈనాడు మహనీయునియొక్క జన్మదినం. ఒక మతప్రవక్తయొక్క జన్మదినం. జీసస్‌ను భగవంతుని బిడ్డగా భావించి భగవంతుడందించిన దూతగా విశ్వసించిన వారు క్రైస్తవులు. ఇలాంటి పవిత్రమైన దినమున మా అనంతపురము పాత విద్యార్థినులు messengers of sai అని ప్రతి సంవత్సరము కూడా ఒక రకమైన మార్గాన్ని అనుసరిస్తూ వస్తున్నారు. మనం చదువుకున్నందుకు, స్వామి కళాశాలలో ఇంతటి ఉన్నతస్థాయికి వచ్చినందుకు మనం యిచ్చే కృతజ్ఞత యేమిటి? పాత విద్యార్థినుల అధ్యక్షురాలైన ఒక అమ్మాయి చెప్పింది. మనం ఏం చేస్తున్నాము. భగవంతునికి మనము ఇచ్చే కృతజ్ఞత ఏమిటి? అని ప్రశ్నించింది.

విద్యార్థినులారా! ఎవరు ఎటుపోయినా నీ భావములు నీవు ఉన్నతంగా పెట్టుకొని సమాజంలో ప్రవేశించి సంఘసేవలో మీరు పాల్గొనాలి. నిజమే ఆ అమ్మాయి చెప్పినట్లుగా స్త్రీలు కొంతకాలంలో వారు గృహిణులై అనేక బంధనలతో, అత్తమామల యొక్క యిచ్ఛలో, భర్త ఆజ్ఞలో మెలగ వలసి వస్తుంది. భారతీయ సంస్కృతిని పురస్కరించుకొని భారతదేశంలో వీరికి అంత ప్రత్యేకమైన స్వాతంత్ర్యము లేదు. కాని boysకు ఎక్కడకు పోయినా వారికి స్వాతంత్ర్యము ఉంటుంది. ఏ ఉద్యోగం చేసినా, ఏ వ్యాపారము చేసినా, ఏ దేశమునకు పోయినా వారికి అడ్డు తగిలే వారుండరు. వారు సేవలు చేయాలని సంకల్పించుకుంటే ఏమైనా చేయగలరు. కాని దురదృష్టవశాత్తు వారికలాంటి పవిత్ర భావాలు రావటం లేదు. స్త్రీలకు ఇలాంటి పవిత్ర భావాలుండి కూడా స్వతంత్రం లేకుండా పోయింది కనుక నేటినుండి నైనా విద్యార్థులు, విద్యార్థినులు మన ఇన్‌స్టిట్యూట్‌లో చదివినందుకు కృతజ్ఞతా సూచకంగా సేవలు చేసి తాము పవిత్ర నడతలు నడచి ఇతరులకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలని నేను ఆశిస్తున్నాను. కేవలం డిగ్రీలు తీసుకున్నంత మాత్రమున మనం గొప్ప విద్యావంతులమని విర్రవీగటం వెఱ్ఱితనము. కేవలం పొట్టకూటి నిమిత్తమై మనం విద్యానంతా వ్యర్థం చేయటం



sri sathyasai vachanamrutam

కూడా వెట్టితనమే. నీవు చదువుకున్న చదువులు తోటి మానవులను సరియైన మార్గంలో త్రిప్పి వారిని పవిత్ర మార్గంలో ప్రవేశపెట్టటానికి నీ విద్యలు ఉపయోగపెట్టాలి.

**జానెడు పొట్ట నింపుకొన చిక్కులు నొందుచు కోటి విద్యలన్**
**పూనిక మీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ**
**మానవజాతి దుఃఖముల క్రమ్మగ నేటికి శ్రీ పరాత్పరున్**
**ధ్యానము చేయ భక్తులకు దారిని చూపకయున్నె మానవా!**

భక్తితో భగవంతుని ధ్యానము చేయువారికి దారిని చూపడా!

**నిద్దుర నుండి లేచి మరి నిద్దురపోయెడు దాక పొట్టకై**
**హద్దును పద్దు లేక వ్యయ మందగ జేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి యరవిందదళాక్షుని విస్మరించి యే**
**పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

భగవంతుని మరచి ఈ విద్యలలో యిరువది నాలుగు గంటలు వ్యయము చేసి ఏమి సాధించారంటే మీరేమైనా చెప్పగలరా! మీరు కించిత్తైనా శాంతి సంతోషము లేమైనా అనుభవిస్తున్నారా? ఏ మానవునైనా what do you want అని అడిగితే I want peace I want peace peace ప్రపంచములో చిక్కుతుందా? ప్రపంచమంతా Pieces. There is no peace. కానీ peace తనయందే ఉంటున్నది. ఈ peaceను మనం పొందే విధానం ఏమిటి? I want peace. three words. I-ego, Want-desire. ఈ రెండింటిని remvoe చేస్తే అక్కడ peace ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ ego, disires తో ఈ peaceని pack చేసిపెడుతున్నాము. ఈ desires కూడా కొంత తగ్గించుకోవాలి. ఏమి desires. ఇంత అంతా అని హద్దులు లేవు ఈ desiresకు. అన్నింటికీ చింతే.

**పుట్టుట ఒక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావుచింత**
**బాల్యములో చింత యవ్వనమొక చింత**
**వార్ధక్యమొక చింత జీవితము చింత**

sri sathyasai vachanamrutam

**కర్మలన్నియు చింత సంతోషమొక చింత**
**సర్వచింతలు బాపెడి సర్వేశ్వరుని భక్తి**
**గొనుడి యికనైన ప్రజలార కోర్కెమీర.**

ఎంత విజ్ఞానము పెరిగినప్పటికి, ఎంత మేధాశక్తులు పెంచుకున్నప్పటికి జగత్తులో శాంతి లేదు. కారణము బాహ్యదృష్టిని మనం పెంచుకుంటున్నాము. అంతదృష్టిని మనం ఏమాత్రము అవకాశము నందించటం లేదు.

**నరజన్మ మహనీయమైనది**

మనము అందరికంటె చాలా గొప్పవారము. జంతూనాం నరజన్మ దుర్లభం. దైవం మానుషరూపేణ. దైవము మనుష్యాకారములో వెలువడినాడు. ఇలాంటి విలువైన మానవత్వమును మరచిపోయి మాణిక్యము వంటి మానవుని జీవితమును మసి బొగ్గుకు అమ్ముకుంటున్నాము. ఎవరు ఈ జగత్తులో richman. Who is the richest man in the world? Who has much satisfaction is the richest man ఎవడు తృప్తిగా ఉంటాడో వాడే rich man. He who has many desires is the poorest man. అన్నీ ఉండి కూడను ఈ **desires**ను పెంచుకోవటం చేత మనము చాలా బీదవారుగా తయరైపోతున్నాము.

ప్రేమస్వరూపులారా! మీరు సాధ్యమైనంత వరకు desires కొంతవరకు అదుపులో పెట్టుకొని జీవితమును ఒక దీర్ఘ ప్రయాణముగా విశ్వసించి ఈ desiresను ఒక లగేజిగా భావించి ఈ ప్రయాణములో అనేక అలజడులు కలగకుండా ఉండే నిమిత్తమై మనలగేజి తగ్గించుకోటానికి చూడాలి. రైల్వే డిపార్టుమెంటులో మీరు చూసే ఉంటారు Less luggage more comfort make travel a pleasure. ఈ desiresను తగ్గించుకోవాలి. ఏదో కావలసినంత desiresను మాత్రమే ఉంచుకోవాలి. తినటానికి తిండి ఉండాలి. కట్టటానికి బట్ట ఉండాలి. ఉండటానికి కొంప ఉండాలి. అంతో ఇంతో రోగము వస్తే మందు కొనటానికి డబ్బు ఉండాలి. ఎంత ధనము పెరుగుతుందో అంత మనస్సు అశాంతి కూడను పెరుగుతుంది. వీనికి నిద్రకూడను రాదు. Worry. Worry. What is the shape of

sri sathyasai vachanamrutam

worry. It is the mental created fear only. ఏ విధమైన రూపము లేదు. మనమై పెంచుకుంటున్నాం. ఇంక భగవంతుని అనుగ్రహం రాలేదంటే ఎలా వస్తుంది? దీనినే వేదాంత పరిభాషలో వైరాగ్యము అని పిలిచారు. క్రమక్రమేణా కొన్ని బాధ్యతలు తగ్గించుకుంటూ రావాలి. ఈ విధమైన పవిత్ర భావములు ప్రపంచమునకు చాటే నిమిత్తమై విద్యార్థులు, విద్యార్థినులు కంకణం కట్టుకోవాలి. ఇంతకాలము సత్యసాయి విద్యాసంస్థలో ఉండినామనే దానికి ఏమి గుర్తు? కుంభ వర్షము కురిసిందంటే కించిత్తైనా తేమ ఉండాలి కదా! అదేరీతిగా మీరు పది సంవత్సరములు, పన్నెండు సంవత్సరములు ఈ విద్యాసంస్థలో ఉండినామంటే దీనిలో అంతో ఇంతో ఏమైనా తెలుసుకొని ఉండాలి కదా! ఆ తెలుసుకున్నది ఆచరణలో పెట్టి ఉండాలి కదా! లేకపోతే ప్రయోజనం యేమిటి? Time is value don't waste time. Time waste is life waste. కాలమును వ్యర్థము చేస్తున్నాము.

**(తేది. 25-12-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam